# సంధ్యావందనం

-సుగంధ శ్రీనివాస్

నా మనసులో వెళ్లాలని లేదు. ఆ ఇల్లన్నా అతడన్నా నాకెందుకో మొదట్నుంచీ అయిష్టమే. ఉషక్క బ్రతికున్నప్పుడైతే దానికోసం వెళ్లేదాన్ని. తనిప్పుడు ఈలోకంలో లేదుకదా. పోతూ పోతూ ఓ పాపను ఇక్కడ వదిలేసి పోయింది చూడు అందుకు తప్పలేదు.

అదేంటోగానీ అక్కా నేను దాదాపు ఒకే పోలిక. కాకపోతే నేను కాస్త పొడుగ్గా వుంటాను. చిన్నప్పుడు నేనే పెద్దదానిలా ఉండేదాన్ని.

"సంధ్యా! అక్కడికెళ్లాక నీ యక్షప్రశ్నలతో బావ మనసును బాధ పెట్టకు. అక్క చనిపోవడానికి కారణాలు మాకు తెల్సు. నువ్వక్కడ ఎంక్వయిరీ చేయనక్కర్లేదు" అంది అమ్మ.

ఇది హెచ్చరికో, సూచనో నేనే అర్థం చేసుకోవాలి. అలాగేనంటూ తలూపుతూ ముఖమ్మీద పడి అల్లరి చేస్తున్న ముంగురులను వెనక్కు తోసాను విసుగ్గా.

అమ్మ మళ్లీ తన ఆలోచనల్లో పడిపోయింది.

ఆ ఆలోచనలేంటో నాకు తెల్సు. అది నా జీవితంలో ముడిపడి వున్న విషయం కాబట్టే నాకంత విసుగు. ఒక్కసారిగా సడెన్‌బ్రేక్‌తో ఆగింది బస్సు.

అంత లోతుగా ఆలోచిస్తున్నా... ముందే ఊహించినట్లు అమ్మ నన్ను తూలి పడకుండా పట్టుకుంది. లేకపోతే నా నుదురు ముందు సీటును బలంగా తాకేది. నిముషంసేపు బస్సు మూల్గులతో, తిట్లతో, శాపనార్థాలతో నిండిపోయింది. కానీ డ్రైవరేం చేస్తాడు ఆ కుక్క ఆత్మహత్య చేసుకునేంత ఊపుతో అడ్డమొచ్చినప్పుడు?

అమ్మకు ఆడపిల్లలంటే చాలా ఇష్టం. ఇద్దరూ అబ్బాయిలే కదా అనుకుని పెద్దమ్మ కూతుర్ని అదే ఉషక్కని చిన్నప్పుడే తీసుకొచ్చిందిట. ఆ కొన్నాళ్లకే నేను ఊడిపడ్డానట. తిరిగి ఇవ్వడం ఇష్టంలేక మమ్మల్నిద్దర్నీ సొంత అక్కాచెల్లెళ్ళుగానే పెంచసాగింది. డిగ్రీ దాకా చదివిన అక్కకు పెళ్లి చేసారు. ఆయన పేరు రఘువంశీ. పెళ్లిచూపులకు వచ్చినప్పటినుంచీ అతడంటే నాకనుమానం పట్టుకుంది.

పెళ్లయింది. అక్క అతడ్ని ఆకాశానికి ఎత్తేసింది "అబ్బా! ఎంత మంచోడో" అంటూ.

"ఓసీ వెర్రిదానా! నీకు అలాగే అన్పిస్తుందిగానీ అతడో పెద్ద ఖిలాడీలా ఉన్నాడు" అన్నాను.

భర్తను అంత మాటంటే ఏ భార్య ఊరుకుంటుంది చెప్పండి?

అందుకే "వంశీ అంటే నీకు కుళ్ళు" అంది ఈరకంగా నన్ను ఓడిస్తూ.

నాకు నవ్వాలో ఏడ్వాలో అర్థంకాలేదు.

వాళ్ల అన్యోన్యతకు సాక్ష్యంగా అక్క నెల తప్పింది. పెళ్లి అయిన టైంలో వెళ్లినదాన్ని మళ్లీ అప్పుడెళ్లాను. ఊహూ... అయినా ఏదో అనుమానం. బాగానే మాట్లాడతాడు. అక్క చెప్పినట్లు వింటాడు. అందరితో కలివిడిగా ఉంటాడు. నేను ఎగతాళి చేసినా పట్టించుకోడు. నా సిద్ధాంతమేమిటంటే అందంగా వున్న మగాళ్లని నమ్మకూడదు. కానీ ఉష నమ్మింది.

పాప అచ్చు అతని పోలికలతో ఈ లోకాన్ని చూసింది. హాస్పిటల్‌లో మరో నాలుగు రోజులు ఉండమని అతడు చెప్పినా "బిల్లు ఎందుకు దండగ" అంటూ అక్క మా ఇంటికొచ్చింది. తొలి కాన్పుకదా.

నెల గడిచిందో లేదో "మావారికి వంట చేతకాదు. ఎలా వుంటున్నాడో ఏమో" అంటూ వెళతానని పట్టుబట్టింది. నాకు తెల్సు అతడు మంచి వంటకాడని. అయినా అక్క చెప్పిన అబద్ధం నన్ను నవ్వించింది.

"ఏంటే నవ్వుతున్నావు? పెళ్లయితే తెలుస్తుంది నీకు?" అంటూ నా తలమీద ఒక్కటిచ్చింది.

వెళ్లింది. అప్పుడూ వెళ్లాను తోడుగా. ఇల్లంతా ఎలాగో వుంటుందని ఊహించుకుని వెళితే అక్క ఇంట్లో వున్నప్పుడు ఎలా వుంటుందో ఇప్పుడూ అలాగే వుంది. మందు సీసాలు, సిగరెట్ పీకలు, పేకలు లేవు. అదే అడిగా అక్కని మెల్లగా.

అందుకది ముసిముసిగా నవ్వి "మీ బావకి అవేవీ తెలియవు. ఈమధ్యే నేర్చుకున్నాడు పేకాట. అదీ నేను నేర్పిస్తే. పాపం ఇప్పటికి ఒక్కసారి కూడా గెలవలేదు" అంది.

నేనింకా సానుభూతితో చూసాను అక్కవైపు.

"ఈ కాలంలో అవి తెలియని మగాడు ఉన్నాడుటే" అన్నాను హేళనగా.

"ఎందుకే నా మొగుడంటే అంత అసూయ" అంది సీరియస్‌గా నన్నే చూస్తూ.

"లేపుకుపోదామని" అన్నాను అంతే సీరియస్‌గా.

"నన్ను వదిలి ఇంచ్ కూడా కదలడు" అంది స్టైల్‌గా చిటికేస్తూ.

అప్పుడు నవ్వక తప్పలేదు నాకు

వారంరోజులక్కడ ఉండి తిరిగొచ్చిన ఇరవయ్యవరోజు ఫోన్... ఉషకి ఫిట్స్ వచ్చి చనిపోయిందని. షాక్! నమ్మలేనితనం, అంతా నైరాశ్యం.

అందరూ ఒక బాధలో వుంటే నేను నా దారిలో అక్క చావుకు బావే కారణమనే అనుమానాన్ని నిజంగా నిరూపించేందుకు ప్రయత్నాలు ఆరంభించాను. మొదట అమ్మతో ఈ మాటంటే నన్నో పురుగును చూసినట్లు చూసి "అసలు బావంటే ఏమనుకుంటున్నావే? అక్కకు బావ ఆరో ప్రాణమైతే అతనికి అక్క పంచప్రాణాలు. నాతో కనుక అన్నావుగానీ బయటెక్కడైనా నోరు జారేవు జాగ్రత్త" అంది తిడుతున్నట్లుగా.

'ఇంట్లో బావకింత సీనుందా?' ఆలోచనలో పడిపోయా.

అక్కకు చిన్నప్పుడు కూడా ఫిట్స్ వచ్చేవట. నయమయ్యాయనుకుంటే ఇప్పుడు ఏకంగా ప్రాణాలే పోయాయి. ఆ టైంలో బావ ఇంట్లో లేడుట. వచ్చేసరికి పాప ఏడుస్తూ, తను విలవిల్లాడుతూ. వెంటనే హాస్పిటల్‌కు తీసుకుపోయినా దక్కలేదట. ఈ కథ నాకు నమ్మబుద్ధికాలేదు. ఇంకా బావమీద అయిష్టత పెరిగి అది తీవ్రమై అనుమానంగా, కోపంగా మారింది.

ఇంతలోనే అమ్మ ఒక బాంబ్ పేల్చింది.

"తల్లిలేని పిల్లలా పాప ఎందుకు పెరగడం? నువ్వెలాగూ ఉద్యోగం చేస్తున్నావు. బావని పెళ్లి చేసుకో. వేరెవరో వస్తే పాపను బాగా చూసుకుంటారో లేదో" అని.

★★★

బస్సు దిగి ఆటో మాట్లాడుకుని వెళ్లేసరికి పాపను తన ఛాతీమీద పడుకోబెట్టుకుని ఏదో మాట్లాడుతున్నాడు.


అమ్మకు కళ్లల్లో నీళ్లు నిండాయి ఆ దృశ్యం చూసి.

మమ్మల్ని చూడగానే ఎదురుగావచ్చి పాపను అమ్మచేతికిచ్చి సామాను తను తీసుకున్నాడు. నా బ్యాగ్ కూడా తీసుకోబోతుండగా ఇవ్వకుండా నిర్లక్ష్యంగా లోనికెళ్లాను.

మొదట్లో బావా వాళ్లమ్మ కొన్నాళ్లుంది. ఉన్నది ఉండకుండా "ఇలా ఎన్నాళ్ళురా? ఈ పిల్లని ఎవరికో ఒకరికి ఇచ్చేసి మళ్లీ పెళ్లి చేసుకో'' అందట.

"కష్టమనిపిస్తే నువ్వెళ్లిపోవే అమ్మా'' అంటూ అదేరోజు పంపించేసాడట.

ఇది జరిగాక కొన్నాళ్లకి "నెలలో పదిరోజులే ఆఫీసుకు వెళుతున్నాను. పని వత్తిడి ఎక్కువవుతోంది. ఏమీ అనుకోకుండా వచ్చి కొన్ని రోజులు ఉండగలరా?'' అని ఫోన్‌లో అభ్యర్థించాడు.



ఈ విషయం వినగానే అమ్మ నన్ను తీసుకుని బయలుదేరింది. ఎలాగూ వేసవి సెలవులు. స్కూళ్ళు నడవవుకదా.

చాలా మారిపోయాడు. ఆ నిగారింపు బుగ్గలు లేవు. ఆ చిలిపికళ్లు నల్లని వలయాలతో, నున్నగా ఉండే గెడ్డం కాస్త గరుకుగా. పాపను చేతుల్లోకి తీసుకున్నాను. ముద్దుగా, బొద్దుగా అక్క చిన్న పెదాలుతప్ప అంతా అతడే. ముద్దు పెట్టుకోబోతున్నదాన్నల్లా ఠక్కున ఆగి వెనక్కి చూసాను. పాప పెదాలనే ముద్దాడా వేరే ఏ భాగమైనా అతడిదేనని. అలా వెళ్లి ఇలా వచ్చాడు సరుకులతో.

నేను బావతో మాట్లాడడంలేదు.

నన్ను పెళ్లి చేసుకోవాలనుకోవడం అత్యాశ కాదా? సరే! అక్క చనిపోయింది. అయితే నన్ను చేసుకోవాలనుకోవడమేమిటి? నా వ్యక్తిత్వాన్ని ఏమనుకుంటున్నాడు? అందుకే పలకరించినా పలకలేదు. ఏమనుకున్నాడో ఊరుకున్నాడు. మొదటి మూడురోజులూ ఉండబుద్ధి కాలేదు. పాపతో కాలక్షేపం, టీవీ చూడడం, అమ్మకు కాస్త సాయం చేయడం.

ఓరోజు బావా వాళ్ల అమ్మ ఫోన్ చేస్తే అమ్మ మాట్లాడింది.

"ఇలాంటి రోగముందని మొదటే చెబితే వద్దనేవాళ్లం. ఎందుకు దాచిపెట్టి వాడికి అన్యాయం చేసారు' అని ఏవేవో అందిట.

అనుకున్నట్లుగానే కట్నం ఇవ్వలేదన్న అలక కూడా ఉంది ఇంకా ఆమెలో.

అదే విషయం అమ్మతో అన్నాను "ఆ డబ్బేదో వాళ్ల ముఖాన కొడితే..." అని.

దానికి అమ్మంది "ఎన్నిసార్లు పంపినా వెంటనే తిరిగి వచ్చింది. 'నేను సంపాదించగలను. మావాళ్లకి సమాధానం చెప్పగలను' అని అక్కతో ఉత్తరం రాసి మరీ పంపించేవాడు" అంది.

★★★

మరుసటిరోజు నుండి బావను కాస్త గమనించడం ఆరంభించాను.


ఊహూ... తన పనేదో తానే. నేనో పక్క ఉన్నప్పుడే అక్కను గిల్లే ఆ అల్లరేది? నేనుండగానే అక్క చేతిలో దెబ్బలు తింటూ అరిచే ఆ చిలిపితనమేది? పక్క గదిలో నేనున్నా కూడా వినిపించేటట్లు అక్కను ముద్దు పెట్టుకునే ఆ మొండితనమేది?

## ప్రొఫెసర్ షెర్లాక్ హోమ్స్

ప్రఖ్యాత రచయిత ఆర్థర్ కానన్‌డైల్ నవలల్లో షెర్లాక్‌హోమ్స్ ఆయన సృష్టికర్తకన్నా ఎక్కువ పేరు తెచ్చుకున్న సంగతి అందరికీ తెలిసిందే. ఆయన చివరి నవలలో కానన్‌డైల్ హోమ్స్‌ని చంపేస్తాడు. దాంతో ఆయన ప్రియ పాఠకులు మళ్లీ హోమ్స్‌ని బ్రతికించమని ఆ రోజుల్లో పెద్ద గొడవ చేసారు. కానన్‌డైల్ తన నవలల్లో ఇచ్చిన అడ్రస్ పట్టుకుని లండన్‌లో ఇప్పటికీ నడపబడుతున్న హోమ్స్ మ్యూజియంను అనేకులు సందర్శిస్తుంటారు.

అంతేకాదు, ఇటీవల మరో చిత్రం జరిగింది. కానన్‌డైల్ తన నవలల్లో హోమ్స్‌ని అంత పాపులర్ చేయగలగడానికి కారణం ఆ డిటెక్టివ్ పరిశోధనలో కెమిస్ట్రీని ఎక్కువగా వాడుకోవడమే. ఇంకా కెమిస్ట్రీ అంతగా పాపులర్ కాని రోజుల్లోనే హోమ్స్ థియరీ పాఠకుల్ని అంతగా ఆకట్టుకుంది. హోమ్స్ రసాయన శాస్త్ర పరిజ్ఞానానికి మెచ్చి ఆయనని గౌరవించాలని అనేకమంది అభిమానులు డిమాండ్ చేయడంతో ఫిక్షనల్ క్యారెక్టర్ అయినా లండన్‌లోని రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ వారు ఇటీవల హోమ్స్‌కి ఫెలోషిప్ ఇచ్చి గౌరవించారు.

-విమలారామం




సాయంత్రమవుతుండగా వచ్చాడు. అమ్మ పాపను హాస్పిటల్‌కు తీసుకువెళ్లి ఇంకా రాలేదు. వెంటనే అర్థం చేసుకున్నాడు.

తనకి కాఫీ టైం అది. వంటింట్లో చప్పుళ్ళు వినిపించాయి. నేనక్కడికి చేరుకునేసరికి అర్థం చేసుకుని వరండాలోకి వచ్చి పేపరు ముందు కూర్చున్నాడు.

తీసుకెళ్లి కాఫీ ముందర పెడదామనుకున్నదాన్నల్లా చేతికిచ్చా. తీసేసుకున్నాడు. ఏ మాట్లాడతాడు? మార్పు నాలో మొదలైందిగానీ అతనిలోకాదు కదా! మెల్లగా గొంతు విప్పాను.

"నువ్వు వేరే అమ్మాయిని చేసుకోవచ్చుగా. నాకంటూ ఇష్టాఇష్టాలుండవా?" అని ఆగిపోయా.

కాఫీ తాగేవాడల్లా అర్థం కానట్లు కొన్నిక్షణాలు చూసాడు. ఏదో అనబోతుంటే అమ్మ కనబడింది వస్తూ. అంతే! మౌనంగా ఉండిపోయాడు.

ఏం అనేవాడని నా కుతూహలం చెక్ చేస్తోంది. ఏవేవో సమాధానాలు దొరుకుతున్నాయి నాకు.

★★★

ఆ రాత్రి భోజనాల టైంలో అతను తిన్నాక మేం తింటుండగా అమ్మతో మెల్లగా అన్నాను "బావ నన్ను పెళ్లి చేసుకుంటానని ఎవరితో అన్నాడు మొదట" అని.

అమ్మ చేయి నోటి దగ్గరే ఆగిపోయింది.

"మేమే అనుకుంటున్నాం. ఎలాగూ జోడీ కుదురుతుంది. మా తప్పును సరిదిద్దుకోవచ్చునని."

అదిరిపడ్డాను.

"అంటే బావ నన్ను చేసుకుంటానని మీతో చెప్పలేదా?"

"అదికాదే. అన్నివిధాలా బుద్ధిమంతుడు. మనం మొదటే జాగ్రత్తలు చెప్పివుంటే అతనికీ అన్యాయం జరిగేదికాదు. అందుకని నిన్నిద్దామని నాన్నే ఆలోచిస్తున్నారు. నాక్కూడా సరేననిపిస్తోంది. ఏ లోటూ రాకుండా చూసుకుంటాడు. అక్క కూతుర్ని నువ్వయితేనే సొంత కూతురులా భావిస్తావు. వేరొకరు అనుకుంటారా?" ఇంకా ఏదో చెబుతోంది.

నాకేదీ వినబడడంలేదు. మెల్లగా చేయి కడిగి అక్కడినుంచి లేచాను.

"నీకిష్టం లేకపోతే మేమేం చేస్తామే" అంటూ అమ్మ కూడా చేయి కదుక్కుంది.

"ఎంతపని జరిగిపోయింది? తనని అతనే కోరుకున్నాడనుకుని బావను ఎంత అవమానపరిచింది? ఎలా అసహ్యించుకుంది?

ఉదయం నుండి ఎప్పుడు ఒంటరిగా దొరుకుతాడా, ఎప్పుడు సారీ చెబుదామని చూస్తే అసలు ఏదీ పట్టించుకోనట్లు తన పనిలో తానే.

సెలవులు చివరికొచ్చాయి. పాపను చూడక ఉండడం కష్టమనే స్థితికి వచ్చా. వెళ్ళేటప్పుడు పాపను తీసుకుపోదామనుకున్నాను అమ్మతో. సరేనంది. బావేమీ అనలేదప్పుడు.

వెళ్ళేముందు "రోజు పాపతో మాట్లాడడంవల్ల ఉషతో మాట్లాడినట్లే ఉండేది. ఇక నాలో నేనే మాట్లాడుకోవాలి" అన్నాడు.

పాపను తీసుకుపోతామంటే ఎగిరి గంతేస్తాడనుకున్నాకానీ దిగులు పడతాడనుకోలేదు. నా అంచనా తారుమారైంది. ధైర్యం చేసి ఆ తొలచిన మనసును చూడడానికి జీవంలేని ఆ కళ్లల్లోకి చూసాను. ఏ భావం లేదు నన్నసలు లెక్కలోకి తీసుకోనట్టు. నా అహం దెబ్బతింది. ఇంటికొచ్చాం.

★★★

కరెక్టుగా పదిరోజుల తరువాత ఇంటికి రమ్మని నాన్నతో ఫోన్ చేయించా. వచ్చాడు. నా ప్రతిపాదన విని మండిపడ్డాడు.

"నన్నేమనుకుంటున్నారు? అంతా మీ ఇష్టమేనా. అక్క పోతే చెల్లెలును

చేసుకోడం, ఆమెకు భార్య హోదా కల్పించడం ఇలాంటివి నాకు చేతకాదు. ఆమె పెళ్లే చేసుకోవాలనుకుంటే బయట చాలామంది మగవాళ్ళున్నారు. మీ స్వార్థానికి ఆమె జీవితం బలి చేయవద్దు. మీకు మంచి సంబంధం దొరక్కపోతే నేను చూసి పెట్టనా?'' అన్నాడు.

"అక్కర్లేదు'' అన్నాన్నేను.

ఇంట్లో నిశ్శబ్దం పరుచుకుంది.

"మీకు పెళ్లాం అవసరం లేకపోవచ్చు. కానీ ఈ పాపకి తల్లి అవసరం. మీరు వద్దన్నా ఈ పాపకి తల్లిగా రాక తప్పదు'' అంటూ తీక్షణంగా చూసా.

నా కోపానికి తను మౌనంగా మారాడు.

మళ్ళీ నేనే "ఇదంతా వద్దనుకుంటే పాపనొదిలేయండి. మేం పెంచు కుంటాం'' అన్నాను.

అంతే! లేచి నిలబడ్డాడు. పాపవైపు కొన్నిక్షణాలు చూసి గడపదాటాడు. అన్నయ్యలు ఆపబోతుంటే చకచకా వెళ్లిపోయాడు.

అలా మాట్లాడటమేమిటని అందరూ తిట్టారు నన్ను. నాకు మాత్రం నవ్వు వస్తోంది. ఎక్కడికి వెడతాడు? రెండునెలలు పాపతో గడిపినందుకే వెంట తెచ్చుకున్నాను తను తండ్రి కదా. వదిలి ఉండలేడన్న ఆయన సెంటిమెంట్ నాకు తెల్సు. వారంరోజులకు ఒకరోజు ఎక్కువ. నేను స్కూలు నుండి వచ్చేస రికి ఇంట్లో వున్నాడు పాపనెత్తుకుని.

"ఉద్యోగం చేసేదానివి. పాపనేం చేసుకుంటావు. నా పాపను నాకిచ్చేయ్. ఎలాగోలా పెంచుకుంటాను'' అన్నాడు.

"అందుకే ఈరోజే రిజైన్ చేసివచ్చాను'' అన్నాను నెమ్మదిగా.

ఇంకేం మాట్లాడలేదు బావే కాదు ఇంట్లో వాళ్ళు కూడా.

నా బ్యాగ్ సర్దుకుని "పద'' అన్నాను.

"ఎక్కడికి?'' అన్నాడు ఆశ్చర్యంగా.

"మనింటికి?'' సమాధానం చెప్పాను.

"ఏం వేళాకోళంగా ఉందా?'' మళ్లీ సీరియస్ అయ్యాడు.

నేను మాట్లాడితే నిప్పులో ఉప్పేసినట్లేనని ఊరుకున్నాను. పావుగంట గడి చాక బైక్ స్టార్ట్ చేసాడు. నేను వెళ్లి వెనకాల కూర్చున్నాను. ఒక చూపు నావైపు చూసి ముందుకు పోనిచ్చాడు.

ఇంట్లోకి అడుగు పెడుతుంటే ఒళ్లంతా పులకరించింది.

***

రాత్రి భోజనాలయ్యాక తనకెదురుగా కూర్చుని పాప పెదాలతోపాటు ముఖాన్నంతా ఆర్తిగా ముద్దాడుతూ గొణుగుతున్నట్లుగా అన్నాను "మాట్లా డితే మీ నాన్న ముల్లేం పోతుంది'' అని.

ఆ మాట వింటూనే ఠక్కున లేచి వెళ్లబోయాడు.

వెంటనే చేయందు పుచ్చుకున్నాను.

"వంశీ! కోపమెందుకోయ్! నవ్వుతూ బ్రతకాలిగానీ'' అన్నాను అక్కలాగే.

గత జ్ఞాపకాలు వెనక్కి తిప్పాయి.

"జీవితం జోకు కాదు వెనక్కు తిప్పడానికి'' అన్నాడు.

"బావా! సిగ్గు వదలి మరీ చెబుతున్నా. మీరంటే నాకిష్టం. అదీ మీ గురించి పూర్తిగా తెల్సుకున్నాకే. మీలాంటి మగాడు భర్తగా దొరకడం మా అక్క అదృష్టం. ఆ అదృష్టం నాకు మిగల్చడానికేమో తనెళ్లిపోయింది. మీకు ఉషను కాకున్నా కనీసం సంధ్యగానైనా...'' అంటూ ఆగాను కన్నీళ్లు చెక్కిళ్లను ముద్దా డుతుంటే.

నాకే ఆశ్చర్యమనిపించింది నేను ఏడ్వడం ఏమిటని?

"అనవసరంగా జీవితాన్ని వ్యర్థం చేసుకోకు. ఈజన్మకు సాధ్యం కాదుగానీ పొద్దున ఇంటికెళ్లిపో'' అంటూ నిర్దాక్షిణ్యంగా తన గదిలోకి వెళ్లిపోయాడు పాపతోసహా.

నేనొంటరిగా... ఏకాకిలా. అంతలో పాప ఏడుపు తెరలు తెరలుగా క్షణక్ష ణానికి ఎక్కువవుతూ. తలుపు తీసుకుని వరండాలోకి వచ్చాడు. ఎంత సము దాయించినా పాప ఏడుపు ఆపడంలేదు.

కాసేపు చూసి దగ్గరకెళ్లి పాపను తీసుకున్నాను. పాప ఏడుపాపింది. పాప నిద్రలోకి జారుకుంది.

***

ఉదయం తను ఆఫీసుకెళుతూ "సంధ్యా! నాకోసం నువ్వన్నీ కాదనుకుని వచ్చినప్పుడు నీకోసం నేను 'నన్ను' కాదనుకుంటే తప్పా?'' అడిగాడు.

"తప్పే. మీరంటే నేనేకదా'' అన్నాను.

"గడుసరి పిల్లా'' అంటూ ముక్కు పట్టి లాగి వెళ్లాడు.

నేను ఆ క్షణమే ఎప్పుడొస్తాడా అని ఎదురుచూడడం ఆరంభించా.

★



## స్టేట్‌మెంట్

కరిష్మాకపూర్ త్వరలోనే ఓ బాబునో, పాపనో కనబోతోంది. అయితే ఆమెకన్నా ఆమె చెల్లెలు కరీనా కపూర్‌కే బోల్డు సంతోషంగా వుందిప్పుడు. పుట్టబోయే బిడ్డ గురించి కరిష్మా కపూర్ ఏం ఆలోచనతో వుందో ఏమో గానీ కరీనా మాత్రం అప్పుడే స్టేట్‌మెంట్లిచ్చేస్తోంది. 'బాబయినా, పాప యినా పుట్టేది ఎవరయినా కానీ, భవిష్యత్ స్టార్ పుట్టబోతున్నట్టే' అని ఢంకా భజాయించి చెప్పేస్తోంది. అంటే మరో తరం స్టార్‌లకి అప్పుడే స్వాగతం చెబుతోందన్నమాట!

